# విధుల్లో అలసత్వం వహించొద్దు

- విచారణలో బాధితులకు అండగా ఉండాలి
- జాప్యం చేస్తే ఇకపై ఉపేక్షించేది లేదు
- నేర సమీక్షలో ములుగు ఎస్పీ శబరీష్

నేరాలపై సమీక్షిస్తున్న ఎస్పీ డాక్టర్ శబరీష్

ములుగు, మార్చి11 (నమస్తే తెలంగాణ) : పోలీసులు విధి నిర్వహణలో భాగంగా కేసుల విచారణను సరైన రీతిలో చేపట్టి బాధితులకు అండగా నిలువాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. గురువారం ఆయన ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. పాత, తాజా కేసులపై ఆరా తీశారు. క్రిమినల్, కోర్టు పెండింగ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ, ఆస్తికి సంబంధించిన నేరాల వివరాలను పోలీస్ స్టేషన్ల వారీగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అధికారులందరూ నేర విచారణలో నాణ్యతను మెరుగుపర్చుకోవాలని, ప్రాపర్టీ రికవరీ కేసుల్లో పురోగతి దిశగా పనిచేయాలన్నారు. పోక్సో కేసులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్స్ నిర్వహించి ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. పొలాలు, అడవుల్లో కరెంట్ వైర్లను అమర్చి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న వారిని గుర్తించి కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ రా ములు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, రాజు, కుమార్, ఆర్ఐలు సతీశ్, సంతోష్, ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, మస్తాన్, కృష్ణప్రసాద్, రవి, అశోక్, సురేశ్, రమేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ధనార్జనే ధ్యేయంగా..

- మళ్లీ రెచ్చిపోతున్న కలప స్మగ్లర్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అటవీ అధికారులు
- తూ తూ మంత్రంగా తనిఖీలు
- మండలంలో కానరాని చెక్‌పోస్టులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇటీవల అక్రమంగా తరలిస్తున్న టేకు కలప బండ్లను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

మహదేవపూర్, మార్చి 11 : తూర్పు ప్రాంతంలో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇంత కాలం సైలెంట్‌గా ఉన్న స్మగ్లర్లు మళ్లీ రెచ్చిపోతున్నారు. మార్కెట్‌లో టేకు కలపకు మంచి డిమాండ్ ఉండడంతో కొందరు ధనార్జనే ధ్యేయంగా దందాను సాగిస్తున్నారు. స్థానికంగానే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి టేకు కలపను దుంగలు, దిమ్మెలుగా మార్చి గోదావరి మీదుగా దాటిస్తున్నారు. ఎడ్ల బండ్లల్లో అటవీ మార్గాల ద్వారా రహస్య ప్రాంతాలకు, అక్కడి నుంచి వాహనాల్లో ఇతర జిల్లాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కలప, అటవీ సంపద అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే చెక్ పోస్ట్‌లు మండలంలో ఎక్కడా లేక పోవడం అక్రమార్కులకు వరంగా మారింది. అధికారుల అండదండలు, సిబ్బంది సహకారంతోనే ఈ దందా మూడు పూవులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నదని ప్రజలు అంటున్నారు. కలప అక్రమ రవాణా నిత్యం జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం సమాచారం అందితేనే స్పందించి తూ తూ మంత్రంగా తనిఖీలు చేపడున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల ఎన్కపల్లి, అంటబ్‌పల్లి గ్రామాల పరిధిలో ఎడ్ల బండ్లలో తరలిస్తున్న టేకు కలపను అధికారులు పట్టుకొని గుర్తు తెలియని వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ రెండు సంఘటనల్లో ఎడ్లతో సహా దుండగులు పారిపోగా కలపతో ఉన్న బండ్లు మాత్రమే అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు అక్కడికి చేరుకునేలోపే అక్రమార్కులు ఎడ్లతో సహా పారిపోయారు. అధికారులు 'మామూలు'గా వదిలేస్తున్నారా? లేక సిబ్బందే వారికి సమాచారం ఇచ్చి తప్పిస్తున్నారా? లేదా పైవారి ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మండలంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం : మంత్రి సీతక్క

తాడ్వాయి, మార్చి11 :గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మండలకేంద్రంలోని నర్సింగాపురంలో రూ.10లక్షలతో సీసీ రోడ్ల పనులు, కాటాపురంలో మజీద్ ప్రహరీతో పాటు సీసీ, వీరాపురంలో సీసీ రోడ్డుతో పాటు బోర్, పైప్‌లైన్ పనులు, రంగాపురం, బీరెల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ పనులతో పాటు తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బోర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్ల సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. తన దృష్టికి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కల్యాణి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ సర్పంచులు అశ్విని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దళిత ఉప ముఖ్యమంత్రిని అవమానించడం విచారకరం

మంగపేట, మార్చి11 : యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర దళిత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కింద కూర్చోబెట్టి అవమానించడం విచారకమని తెలంగాణ మాల మహానాడు ములుగు జిల్లా అధ్యక్షుడు రాజమల్ల సుకుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ అవమానంపై దళిత సమాజం తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నదన్నారు. పూజలో పాల్గొన్న సీఎం, ఇతర మంత్రులకు కుర్చీలు వేసి కూర్చోబెట్టి, దళిత ఉప ముఖ్యమంత్రిని ఈవిధంగా కూర్చోబెట్టి దళిత సమాజాన్ని కించపరిచినట్టే అన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి ఆలయ అధికారిని సస్పెండ్ చేయడంతో పాటు, బాధ్యులైన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యాశాఖ కో ఆర్డినేటర్‌గా మల్లారెడ్డి

ములుగురూరల్, మార్చి11 : విద్యాశాఖ సమగ్ర శిక్షణ క్వాలిటీ కోఆర్డినేటర్, ఎఫ్ ఏవోగా చల్వాయి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కాటం మల్లారెడ్డిని డీఈవో పాణిని నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లారెడ్డిని పలువురు విద్యాశాఖ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఐదుగురు ఎస్సైల బదిలీ

కృష్ణకాలనీ, మార్చి 11 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో వీఆర్‌లో ఉన్న దాసరి సుధాకర్ టేకుమట్ల ఎస్‌హెచ్‌వోగా, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న గట్ల సుధాకర్ భూపాలపల్లి వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న కే పవన్‌కుమార్ భూపాలపల్లి మొదటి ఎస్సైగా, భూపాలపల్లి రెండో ఎస్సైగా పని చేస్తున్న జీ సంధ్యారాణి వీఆర్‌కు, భూపాలపల్లి డీఎస్‌బీలో పని చేస్తున్న ఆకుల శ్రీనివాస్ భూపాలపల్లి రెండో ఎస్సైగా బదిలీ అయ్యారు.

## పస్రా ఎస్సైగా కమలాకర్

గోవిందరావుపేట, మార్చి11 : పస్రా ఎస్సైగా ఏ కమలాకర్‌ను నియమిస్తూ మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న షేక్ మస్తాన్‌ను ములుగు డీసీఆర్‌బీ ఎస్సైగా బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న కమలాకర్‌ను పస్రా ఎస్సైగా నియమించారు.

## ఓసీ-3 భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం

కృష్ణకాలనీ, మార్చి 11 : కేటీకే ఓసీ-3లో భూములు కోల్పోతున్న గణపురం మండలంలోని కొండంపల్లి భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందిస్తామని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో వ్యవసాయ భూములు, ఇంటి స్థలాల ధర నిర్ణయించడానికి గ్రామ సభ నిర్వహిస్తామని, ఏవైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. ప్యాకేజీతోపాటు ఇంటి స్థలాలు సైతం అందజేస్తామన్నారు. భూ సేకరణ ప్రక్రియలో దళారులను నమ్మి మోసపోవద్దని, సలహాలు, సూచనల కోసం స్థానిక తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను సంప్రదించాలన్నారు. రానున్న 15 రోజుల్లో డిక్లరేషన్ చేస్తామని, మే నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, సింగరేణి ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఇనగాల పద్మ, ఎడ్ల యాకలక్ష్మి, ఎడ్ల ఓదెమ్మ, క్రాంతి కుమార్, ఎంపీడీవో భాస్కర్, మోతె కరుణాకర్, సుంకరి సుధాకర్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల పర్యవేక్షకుల నియామకం

కృష్ణకాలనీ, మార్చి 11 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పర్యవేక్షణకు 17 మంది అధికారులను నియమించినట్లు కలెక్టర్ భవేశ్ మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ అధికారులు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల కార్యక్రమాలు పర్యవేక్షించాలని, నోటిఫికేషన్ ప్రకటించగానే ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కాగా, ఆర్ అవినాష్, ఎన్ వసుమతి, ఎం వీరభద్రయ్య, ఆర్ సాయిబాబు, ఎల్ విజయలక్ష్మి, ఏ సంపత్ రావు, కే వెంకటేశ్వర్లు, పీ నరేశ్, డీ శైలజ, వీ నారాయణరావు, ఎస్ శ్రీనివాస్‌రావు, ఏ వెంకటేశ్వర్‌రావు, ఎం మంగిలాల్, ఆర్ శ్రీనివాస్, డీ సంజీవరావు, ఈ నాగేశ్వర్ రావు, ఎస్ దిలీప్‌కుమార్ నోడల్ అధికారులుగా నియమితులయ్యారు.

## ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

తాడ్వాయి, మార్చి 11 : బావిలో ఈతకొట్టేందుకు వెళ్లి పెద్ది కృష్ణప్రసాద్ (13) మృతిచెందాడు. ఈ సంఘటన మండలకేంద్రంలోని నర్సింగాపురం పంట పొలాల్లోని బావి వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఏటూరునాగారం మండలం శంకర్ రాజుపల్లికి చెందిన పెద్ది దేవి, కేశవులు దంపతుల కుమారుడు కృష్ణప్రసాద్ మండల కేంద్రంలోని వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్‌లో ఉంటూ ఇందిరానగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల సమయం పూర్తయిన తర్వాత కృష్ణప్రసాద్ తోటి స్నేహితులతో కలిసి నర్సంగాపురం గ్రామ సమీపంలోని బావి వద్దకు ఈతకు వెళ్లాడు. బావిలోకి దిగిన బాలుడికి ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతూ కేకలు వేశాడు. ఒడ్డునే ఉన్న ముగ్గురు బాలురు కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాల వద్ద ఉన్నవారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే బాలుడు నీటిలో మునిగిపోయాడు. కాగా, ముగ్గురు బాలురు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు బావి వద్దకు వెళ్లి గజ ఈతగాళ్లతో కృష్ణప్రసాద్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తండ్రి కేశవులు మూడు నెలల క్రితం మృతిచెందాడు. మూడు నెలల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి.

## గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

రామనుజన్ (ఫైల్)

వెంకటాపూర్, మార్చి 11 : మండలంలోని రామంజాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త నడిగోటి రామనుజన్ (50) గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం గుండెపోటు రాగా హనుమకొండలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడి పార్థివదేహాన్ని ఎంపీపీ బుర్ర రజితా సమ్మయ్య, జడ్పీటీసీ గై రుద్రమదేవి, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌రావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మునిగంటి చారి, నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులు అర్పించారు. కాగా మృతుడికి భార్య పుష్ప, కుమారుడు రాహుల్, కుమార్తె చైతన్య ఉన్నారు.

## ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి

ఏటూరునాగారం, మార్చి 11 : ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం తుడుందెబ్బ, ఏటీఎఫ్, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబెల్లి గణేశ్ మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక గిరిజన డీఎస్సీని ప్రకటించాలని కోరారు. రోజు రోజుకూ గిరిజన విద్య కుంటుపడుతున్నదని, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి కనబర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పొడెం బాబు, అర్రెం నారాయణ, డీ నారాయణ, రామారావు, వేణు, అరవింద్, సుధీర్ పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

- భూ నిర్వాసితులను మోసం చేస్తే కఠిన చర్యలు
- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- నగరంపల్లి వాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ఇండ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గణపురం, మార్చి 11 : నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం కేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నగరంపల్లి వాసులకు గణపురం మండలంలోని రామప్ప కాలనీలో కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆయన ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంపల్లి వాసులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని, రామప్ప కాలనీని సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేస్తానన్నారు. మొత్తం 84 మందికి చెల్పూర్ గ్రామ పరిధిలోని 143 సర్వే నంబర్‌లో 200 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేశామని, పేద వాళ్లుంటే ప్రభుత్వం తరపున ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. అనంతరం కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ రామప్పకాలనీకి సమీపంలోనే వైద్య కళాశాల ఏర్పాటయ్యిందని, ఆయుష్ ఆస్పత్రి, క్రిటికేర్ యూనిట్లు రానున్నాయన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, ఇంటి పట్టా కోసం తమ వద్ద రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు లంచం తీసుకున్నారని నగరంపల్లి భూ నిర్వాసితులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డబ్బులు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీవో భాస్కర్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### వినియోగించుకోవాలి

కృష్ణకాలనీ : ప్రభుత్వం అందించిన వాహనాలను వినియోగించుకుంటూ చేపల వ్యాపారం ద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌లో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 60 శాతం సబ్సిడీతో మంజూరైన 22 ఆటోలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన ఆటోలను అమ్ముకోవద్దని, వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రామిశెట్టి అవినాష్, ఆర్డీవో మంగీలాల్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ప్రమాదవశాత్తు దగ్ధమైనా ఇళ్లు

గణపురం, మార్చి 11 : మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రాములుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి వెనుక వైపు నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే రాములు కుటుంబ సభ్యులు అప్రమత్తమై చుట్టు పక్కల వారికి సమాచారం ఇవ్వడంతో మంటలార్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఫర్నిచర్, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఎడ్ల రాములు విజ్ఞప్తి చేశారు.

## కేటీకే ఓసీ-2లో భూ నిర్వాసితుల ధర్నా

కేటీకే ఓసీ-2లో ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

కృష్ణకాలనీ, మార్చి 11 : భూములు కోల్పోయిన తమకు ఇంత వరకు సింగరేణి యాజమాన్యం ఎలాంటి నష్ట పరిహారం అందించలేదని భూ నిర్వాసితులు సోమవారం కేటీకే ఓసీ-2 ప్రాజెక్టులో పనులు నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు సామల మధుసూదన్‌రెడ్డి, బుర్ర రాజయ్య, బొతు రాయమల్లు మాట్లాడుతూ డబ్బులు మంజూరైనప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల తమకు నష్టపరిహారం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇండ్లను ఆనుకునే ఓసీ-2 ఉండటంతో దుమ్ము, ధూళితో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆకుదారివాడ, ఫకీర్‌గడ్డ భూ నిర్వాసితులు బుర్ర మనోజ్, సెగ్గం శంకర్, యాకుబ్ అలీ, బాలయ్య, హతీరామ్‌తో పాటు 50 మంది పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఎంపిక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

కాటారం, మార్చి 11 : యువత అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో స్థిరపడాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆయన ప్రారంభించారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి దాదాపు 1,560 మంది యువతీ యువకులు పాల్గొనగా, 65 కార్పొరేట్ కంపెనీల హెచ్ఆర్‌లు, డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు రంగాల్లో ఆశించిన వేతనాలతో మంచి ఉద్యోగాలు వస్తున్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ మేళాలో ఉద్యోగానికి ఎంపిక కాలేదని నిరుత్సాహ పడొద్దని, ఉద్యోగ సాధన కోసం ప్రయత్నం చేస్తూనే ఉండాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన 231 మందికి కలెక్టర్, ఎస్పీ నియామక పత్రాలను అందజేశారు.

కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర మేనేజర్ మన్మోహన్, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేంనూరి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ములుగురూరల్, మార్చి 11 :పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోషణ పక్షం కార్యక్రమంపై జిల్లా స్థాయి అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించి గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23 వరకు వివిధ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో గ్రామ, మండల, ప్రాజెక్టు, జిల్లా స్థాయిల్లో షెడ్యూల్ ప్రకారం పౌష్టికాహార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. డీడబ్ల్యూవో స్వర్ణలతా లెనిన్ మాట్లాడుతూ రక్తహీనత తగ్గించడానికి సంప్రదాయ వంటకాలు, పోషకాహారంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ములుగు రూరల్/కృష్ణకాలనీ, మార్చి 11 : ప్రజావాణికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, భూపాలపల్లి అదనపు కలెక్టర్ కే వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం ఆయా కలెక్టరేట్లలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ములుగు జిల్లాలో మొత్తం 21 అర్జీలు వచ్చాయని, అందులో 16 రెవెన్యూ, 5 ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయని, భూపాలపల్లిలో 15వినతులు స్వీకరించామని, వాటిని ఆయా శాఖల అధికారులకు సిఫారసు చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు వారికి కేటాయించిన మండలాల్లో పర్యటించాలన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ములుగు జిల్లాలోని ఆయా శాఖల అధికారులు శ్రీపతి, ప్రకాష్, నాగేశ్వర్‌రావు, సర్దార్‌సింగ్, తుల రవి, స్వర్ణలత లెనినా, వినోద, ప్రేమలత, అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్‌లో వినతుల వెల్లువ

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్ర మిశ్రా

ఏటూరునాగారం, మార్చి 11 : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పీవో చిత్ర మిశ్రాకు గిరిజనులు తమ అర్జీలు సమర్పించారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, గిరి వికాస పథకం కింద బోర్లు వేయాలని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, టీఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం అందించాలని పలువురు వినతులు అందజేశారు. అలాగే పెసా బ్లాక్ కోఆర్డినేటర్లను నియమించాలని, మంగపేట మండలంలో ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని పీవోను కోరారు. దర్బార్‌లో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఈఈ హేమలత, ఏవో దామోదరస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, ఎస్‌వో రాజ్‌కుమార్, ఏడీఏ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సతీశ్, జీసీడీవో సుగుణ, పెసా కో ఆర్డినేటర్ ప్రభాకర్, జేడీఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చిట్యాల, మార్చి 11 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీఐ మల్లేశ్ యాదవ్ ఆదేశాల మేరకు మండలంలోని నవాబుపేట, జడలపేట ఎక్స్‌రోడ్ వద్ద వాహన